

# నాట్ ఫర్ హైర్

రాయప్రోలు లలిత

స్వంత వాహనం ప్రతివారికి వుండటం అన్నది అనాదిగా ప్రిస్టేజ్ ,యిష్యూయే! పూర్వకాలంలో ఎంతటి వీరుడివైనా షికారుకు వెళ్ళటానికి రథం కొనకపోతే ఆ యింట్లో శాంతి పూజ్యం అని నా నమ్మకం. సైకిల్ కొన్నందువల్ల యింటావిడికు పెద్దగా ఉప

యోగం లేక పోయినా ప్రక్కింటి వాళ్ళ అబ్బాయిని బజారుకు పంపడానికి ఉపయోగిస్తుంది. అందువల్ల ప్రతియింట్లో వారి వారి ఆదాయాన్ని బట్టి వాహనం కొనడానికి నిరంతర ప్రయత్నం జరుగుతూనే వుండటం అందరికీ అనుభవంలో వున్నదే!

మా యిల్లు కూడా ఈ విషయంలో అందరితోబాటు లోకాన్ని అనుసరిస్తున్నది రెండు వందలరూపాయలు ఆదాయం వున్నప్పుడు సైకిలుతో సరిపెట్టుకొన్న 'ప్రిస్టేజ్'' యిప్పుడు స్కూటర్ లేకపోతే చాలా క్రిందికి దిగి పోయినట్లయింది. పోనీ స్కూటర్ కొందామా అంటే వెస్పాకి ఏడేళ్ళు, లాంబ్రెటాకి ఐదేళ్ళ వెయిటింగ్ తోనే సరిపోతుంది. స్కూటర్ ఖరీదంత బ్లాక్ మనీ యివ్వటానికి మనసొప్పదు. మిగతా రకాలు చీప్‌లో కొని 'ప్రిస్టేజ్'ని నిలబెట్టు కొందామంటే సైకిల్ వేగాన్ని మించవు. ముఖ్యంగా శ్రీమతులు కూర్చొనేందుకు సరిపోవు. (ఊహించే వుంటారు మా ఆవిడ బరువు) ఆఖరుకు బాగా ఆలోచించి ఎప్పుడొస్తే అప్పుడే కొందామని వెస్పాబుక్ చేశాము. నెలకోసారి వెళ్ళి లిస్ట్‌లో మా నెంబరు ఎంత ముందుకొచ్చిందో వాకబు చేయటంలో మూడేళ్ళు పట్టింది. ఇప్పుడు మాకు వెస్పాతో పని లేకుండా పోయింది. మా జనాభా మొత్తం 2 + 2 అయింది.

ఒక రోజు ప్రొద్దున్నే మా బావమరిది గారు దిగ బడ్డారు. ఏం మహానుభావా అంటే! అతనూ వాళ్ళన్నయ్యా ఆస్తులు పంచుకొన్నారట. ఆడబడచుకదాని మా ఆవిడగార్కి చెరో వెయ్యి యిచ్చేందుకు నిశ్చయించుకొన్నారట. ఇచ్చి పోదామని వచ్చారాయన. నాకు చటుక్కున ఒక ఐడియా వచ్చింది. మా ఫ్రెండ్‌కి నెక్స్ట మంత్‌లో వెస్పా అలాట్‌మెంట్ అయిందట. ఏదో చిన్న బండి యిన్నాళ్ళు వాడుతున్నాడు. అది అమ్మాయాలనుకున్నట్టు మాటల సందర్భంలో అన్నాడు. అదినేను తీసుకొంటేనో! అనే ఆలోచన బయట పెట్టి శ్రీమతిగారి పూర్తి అంగీకారం తీసుకొని (స్త్రీ ధనం కదా) బావమరిదిగారితో కలిసి ఫ్రెండింటికి వెళ్ళాను. బేరం సెటలయి పోయింది తొందరగానే!

మా గాడి బ్రహ్మాండంగానే రోడ్డుమీద జారిపోతుందిగాని ఒక్కటే డిఫెక్ట్. శబ్దం ఎక్కువ స్పీడు తక్కువ. ప్రొద్దున్న స్టార్ట్ చేస్తే స్టార్టింగ్ ట్రబుల్ వుండదని బండి కొన్నప్పుడు స్నేహితుడు సలహా ఇచ్చాడు. రోజూ అదో కార్యక్రమం. దాన్ని స్టార్ట్ చేసినప్పటి మోతకి మా పిల్లలిద్దరూ కుయ్యోమంటూ లేచి కూర్చొనేవారు. మా ఆవిడ కూడా పదిరోజులు వాళ్ళ గోలనీ నా గోలనీ ఐమీన్ స్కూటర్ గోలనీ భరించింది కానీ ఇంక భరించలేక కొంచం విసుగుని ప్రదర్శించటం మొదలుపెట్టింది. ఈ సమయంలోనే మాకు హైదరాబాద్

ట్రాన్స్ఫర్ అయింది. అంత అందమైన వూరికి ఈ డబ్బా స్కూటర్ పట్టుకెళ్ళొద్దు అమ్మేద్దామని మా ఆవిడ,నువ్వూ ఆ ఊర్లో ఉండ తగనని నేనూ. నేను మటుకు ఆ స్కూటర్ తీసుకెళ్ళటానికి ఒప్పుకోను అని ఫైనల్ వార్నింగ్ యిచ్చింది మా ఆవిడ. ఏం చేస్తాం ఖర్మ! ఆడవాళ్ళదే రాజ్యం అనుకొని బండిని తీసుకెళ్ళి నేను కొన్నతని అప్పగించి 'నాయనా ఎంతిచ్చినాచాలు' అన్నాను.

చిన్న చిన్న ఊళ్ళల్లో అయితే స్కూటర్ మీద ఇంతమందే ఎక్కాలన్న రూల్ లేదు కాని, ఈ ఊళ్ళో మటుకు మూడో తలకాయని ఎలో చెయ్యరట! అన్నట్లు చెప్పటం మరచిపోయా, మేము వెస్పాకి రిజిస్టర్ చేస్తే దానిపేరు 'బజాజ్' అని మార్చుకున్నది కానీ మా కింకా ఎలాట్ మెంట్ కాలేదు. మా శ్రీమతి చెప్పిన శుభ వార్త విని ఇక స్కూటర్ విషయం మర్చిపోయి వేరే ప్రయత్నం మొదలు పెట్టాల్సి వచ్చింది.


కారు— మా ప్రస్తుత జనాభాకి సరిపోయే వాహనం. మా బడ్జెట్ కు ఎక్కడా అందనిది. సెకండ్ హేండ్ కారు ఐదారు వేలకే దొరికితే చూద్దామని ఒకరిద్దరితో చెప్పాను. రెండు కార్లు చూపారు కానీ రెండూ వింటేజ్ కార్ రాలీ (Vintage car rally) కి పనికొచ్చేవే! కొంచెం లేతవయస్సు లేక మధ్య వయస్సులో వున్నవి కొనడానికి డబ్బుకోసం నాకు మధ్యవయస్సు వచ్చేదాకా ఆగాలి. ఈ అన్వేషణలో నా క్షోక ఆలోచనవచ్చింది. అదే ఈ రచనకు ఆధారం.

పెద్దపెద్ద పట్టణాలలో వ్యాపారస్తులు. బాగా డబ్బున్నవారు ఎంత దూరమైనా తీరుబడిగా వెళ్ళడానికి రిక్షాలు వుంచుకొంటారట. కానీ ఈ జెట్ యుగంలో రిక్షా కొనటం నా కెందుకో రుచించ లేదు. కారు మన అందుబాటులో లేదు. అప్పుడో ఆలోచన వచ్చింది— ఆటోరిక్షా!

ఆటో రిక్షాలు స్వతంగా వాడుతున్న వాళ్ళని ఎందువల్లనో నేను చూడలేదు. డెలివరీ వానులుగా అద్దె రిక్షా లు గా చూశాను. అదయితే మాకు అన్నివిధాలా సరిపోతుంది. వాకబు చేసి మూడు నాలుగునెలలలోగా ఆటోరిక్షా సంపాదించ గలిగాను.

ఇక మొదలయింది కథ!

రిజిస్ట్రేషన్ చెయ్యడానికెడితే ఆటో రిక్షాకు ప్రైవేటు రిజిస్ట్రేషను కుదరదు. పబ్లిక్ కేరియర్ గా చెయ్యాలంటారు. నేను నా స్వంత వాడకానికి కొన్నానని చెప్తే నమ్మరుకదా ఖర్మ. "ముందు ఇలా రోడ్ టాక్స్ తగ్గుతుందని చేస్తారు కాని అసలు అద్దెకే నడుపుతుతారు. ఇంతకీ మీ ఆటోకి ఫేర్ మీటరు లేదు. రిజిస్ట్రేషన్ చెయ్యడానికి వీల్లేదు." అని ఖచ్చితంగా చెప్పాడక్కడి మహానుభావుడు. అతన్ని



ఎలాగైతేనేం నమ్మించి ప్రైవేట్ వెహికల్‌గా రిజిష్టర్ చేయించడానికి నా తల ప్రాణం తోకకొచ్చిందంటే నమ్మండి.

మర్నాడు మంచి టైము చూసి, మా ఆవిడనీ, పిల్లల్నీ ఎక్కించుకుని బయల్దేరాను. మర్చే పోయాను చెప్పడం. మా ఆటో రంగు విషయంలోకూడా కొంచం శ్రమపడాల్సి వచ్చింది. కంపెనీ ఒరిజనల్‌గా నలుపూ పసుపూ వేసి పంపించింది. అది మార్చి నా కిష్టమయిన నీలంవేయించడాన్కి రెండు మూడు గారేజ్‌లు తిరగాల్సివచ్చింది. వాళ్ళందరూ "మీకు తెలియదండీ! ఆటోలకి పసుపూ నలుపే ఉండాలి. మేము ఎన్నిటికి వేస్తున్నాము" అనేవాళ్ళు. ముందుగా మా బంధువుల ఇంటికి వెళ్ళాము. అక్కడ గుమ్మందగ్గిర ఆపి, తాళంవేసి లోపలికి వెళ్ళాము. ఈ లోపల ఇద్దరు ముగ్గురు గుమ్మం దగ్గర కొచ్చి, "ఏ య్ ఆ టో! చ ల్తే క్యా" అన్నారు. వాళ్ళకి ఇది స్వంత ఆటో అని

చెప్పటం వ్యర్థం అనిపించి, నహీ చలేగా అని చెప్పి పంపించేశాను.

సాయంత్రం సినిమాకి అని బయలు దేరాము. సినిమాహాల్స్‌లో కార్లకీ, స్కూటర్లకీ, సైకిళ్ళకీ వేర్వేరు జాగా లున్నాయి. మా ఆటో ఎక్కడ ఉంచడమో అర్థం కాలేదు. కార్లు పెట్టేచోట పెడితే అక్కడి అటెండర్ ఆటోలకి ఇక్కడ పార్కింగ్ వీల్లేదన్నాడు. వాడితో నా కథంతా చెప్పి ఆటో నా స్వంతందని, డ్రైవర్ని నేనేననీ నమ్మించి అక్కడ ఉంచాను.

మర్నాడు ఆఫీసుకి ఆటో తీసుకెళ్ళాను, మా వాళ్ళందరూ కొంచం వింతగానూ, చూసారు. ఏమయినా మధ్యాహ్నం కాఫీ పార్టీతో వాళ్ళని సంతృప్తి పరచగలిగాను. సాయంత్రం ఆఫీసు అవగానే మంచి స్పీడులో వస్తున్నాను. ట్రాఫిక్ లైటు దగ్గిర ఆగగానే ఒకాయన ఎక్కి కూర్చు న్నాడు అటీడ్స్‌చలో అని అతన్ని దిగ మందామనుకునే లోపే గ్రీన్ లైటు వెలి గింది. వెనకాల వాళ్ళు హారన్ మ్రోగిం చడం మొదలు పెట్టారు. సరేనని లైటు దాటించి ముందుగా ఒక ప్రక్కన ఆపి ఆయనని దిగమన్నాను. ఎందుకు దిగాలి! అన్న ప్రశ్న వేసాడు ఇది మిమ్మల్ని తీసి కెళ్ళదు కనుక. అని పెంకెగా సమాధానం చెప్పాను. ఎందుకు తీసికెళ్ళదు? నీ నంబ రెంత! ముందు ట్రాఫిక్ కానిస్టేబులు వద్దకి నడు. బొంబాయిలో టాక్సీలు పాసిం జర్ని ఎక్కించుకోకపోతే పోలీసు వాళ్ళు ఆ డ్రైవర్ని మరామ్మత్తు చేస్తారు. ఇక్కడ కూడా ఆ పద్ధతి వస్తేగాని బాగు పడదు. అని దిగకుండానే కబుర్లు చెప్పటం సాగించాడు. ఈ ఆటో నా స్వంతందయ్యా! అద్దెదికాదు. అని చెపుతుంటే ఓనర్ డ్రివెన్ అయినా ఆటో రిక్షా పాసింజర్ సిటీలో ఎక్కడికి తీసికెళ్ళ మంటే అక్క డికి తీసుకెళ్ళాలి. నీకు తెలియకపోతే తెలిసిన వాళ్ళనడుగు చెప్తారు. అవిదిట్టంగా కూర్చున్నాడు. కాలర్ పట్టుకులాగి అవ తల పారేద్దామనుకుంటుండగా అదృష్ట వశాత్తూ ఒక ట్రాఫిక్ కానిస్టేబులు అటు వచ్చాడు. నేను ఈ గొడవ చెప్పేలోగా అతను అడిగిన మొదటి ప్రశ్న, "నీ ఫేర్ మీటర్ ఏది?" అని. ఎలాగైతేనేం, నా లైసెన్సు, ఆటో 'సి' బుక్కూ అన్నీ చూపించి ఆ కూర్చున్న పెద్ద మనిషిని దింపించి, చుట్టూ మూగిన గుంపుని చెదర గొట్టి బయల్దేరడానికి పదిహేను నిముషాలు పట్టింది.

ఇంటికిరాగానే జరిగిందంతా మా ఆవిడతో చెప్పాను. అసలు ఆటో కొన్న ఆనందమే లేకుండా మొహం ఇంత చేసు కుని ఇంట్లో జరిగిన విషయాలు నాతో చెప్పింది. మా పనిమనిషి ఎవళ్ళ ఇంటికో వెళితే వాళ్ళన్నారట, "రిక్షాయే నయం కనీసం తొక్కేవారు వేరే ఉంటారు

ఆటో నడిపేదీ ఆయనే. వెళ్ళేదీ ఆయనే పార్టు టైము పని చెయ్యడానికి వీలుగా ఉంటుందని తెచ్చినట్టున్నారే. బాగానే ఉంది. అని మా పనిమనిషి కాస్త మా పక్షంగా మాట్లాడుతుంది. ఆవిడతో చిన్న ఘర్షణ పెట్టుకుని వచ్చి ఊరికే ఉండ బట్టక ఆ విషయం మా ఆవిడ నేను చెప్పిన విషయాలు విని రేపుతీసి కెళ్ళి అమ్మేస్తారా లేదా అని పట్టుపట్టుకూర్చుంది. మెల్లిగా నచ్చచెప్పి మర్నాడు ఊళ్ళో కాస్త వాకబుచేసి, ఆటో రిక్షాని అద్దెకి తీసుకునే వాళ్ళని వెతికి పట్టుకుని, అద్దె ఆటో తతంగం అంటే రంగు మీటరు వగైరాలు జరిపించి వదిలించుకున్నాను.

నా సలహా ఏమిటంటే ఆటో రిక్షా స్వంతానికి వాడుకుందామనుకునే వాళ్ళు ఆటో చుట్టు "స్వంత వాడకానికి" నాట్ ఫర్ హైర్," "ఖుద్ కాగాడీ" అని త్రిభాషా సూత్రాన్ని పాటిస్తూ నాల్గు పక్కలా వ్రాయించి, ఇరుగు - పొరుగు వాళ్ళ మాటలు ఖాతరు చెయ్యకుండా ఉండ గలిగితే కోనండి. లేకపోతే వద్దు. *

## పెండ్లి చూపులలో

మగపెళ్ళివారు: మీ అమ్మాయి క్వాలిఫికేషన్స్ ఏమిటి?

ఆడపెళ్ళివారు: మా అమ్మాయి, జై ఆంధ్రా ఉద్యమంలో ప్రధమ పాత్ర వహించింది. నిరాహార దీక్షలలో పలుసార్లు పాలుపంచుకుంది. మరి మీ అబ్బాయి సంగతి?

మగపెళ్ళివారు: మా అబ్బాయి ఏం తక్కువ కాదండోయ్! రెండు బస్సులు, ఒక జీపు, పోస్టాఫీసు, రైల్వే క్యాబిన్ తగులపెట్టాడు. అంతే కాదు లాఠీ చార్జిలో రెండువేళ్ళు కూడా ఇరగ్గొట్టుకున్నాడు!

—ఎన్. బాజ్జి.